క్లుప్తంగా

చంద్రంపాలెం పాఠశాలలో ఆధార్ శిబిరం

మధురవాడ: విద్యార్థులకు అపార్ కార్డు జనరేషన్‌లో భాగంగా ఆధార్ కార్డుల్లో లోపాలు ఉండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆధార్ కార్డుల్లో పిల్లల వివరాలు సరిచేయడం కోసం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం, మంగళవారం రెండు రోజుల పాటు ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీఎస్ సోమయాజులు చెప్పారు. విద్యార్థుల కోసం ప్రత్యేక పెట్టిన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రముఖులకు నివాళి



అయ్యంకి వెంకటరమణయ్య, రంగనాథన్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

తగరపువలస: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆనందపురం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ సారథులు అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్. రంగనాథన్‌లను స్మరించుకున్నారు. అడల్ట్ ఎడ్యుకేషన్ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ బంటుపల్లి సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ శ్రీనాధు నారాయణరావు, గ్రంథాలయ అధికారి బి.వి.ఎస్.అప్పారావు, ఎస్.సత్యమూర్తి కార్యక్రమంలో పాల్గొన్నారు. వెంకటరమణయ్య అనేక గ్రంథాలయాలను ప్రారంభించారన్నారు. రంగనాథన్ జీవిత విశేషాలను వివరించారు.

శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



శ్రీవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

కొమ్మాది: రుషికొండలోని మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయానికి(టీటీడీ) ఆదివారం భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం, పిక్నిక్ సీజన్ కావడంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు శ్రీవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. కొండకు చేరుకున్న భక్తులు ముందుగా శ్రీవారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహ స్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

బాల్యం బందీ..!



కొమ్మాదిలో భిక్షాటన చేస్తున్న మహిళలు

మధురవాడ: తమ పొట్టపోషణ కోసం కొందరు చిన్నారుల భవితను బందీ చేస్తున్నారు. వారిని చక్కన పెట్టుకుని రద్దీగా ఉండే కూడళ్లలో భిక్షాటన చేయడంతో ప్రమాదకరంగా మారుతుందని పలువురు వాపోతున్నారు. కొంతమంది మహిళలు ఎండా, వాన, చలి వంటి ప్రతి కూల పరిస్థితుల్లో కూడా పిల్లలతో వాహనాల మధ్య కలియ తిరుగుతున్నారు. పొట్టకూటి కోసం ఎన్నో మార్గాలు ఉన్నా చిన్నారులతో రోడ్ల మధ్య ఇలా తిరుగుతున్నారని వాహనదారులు చెబుతున్నారు. పోలీసు, ఇతర ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి వారికి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపించాలని కోరుతున్నారు. ఇలా చేయడం వల్ల చిన్నారులు కూడా క్షేమంగా ఉంటారని చెబుతున్నారు.



తగరపువలస వంతెనపై విద్యుత్ లైట్లు లేని దృశ్యం



బుధవారం రాత్రి గోస్తనీ నదిపై ప్రమాదం కారణంగా వంతెన ఎడమ భాగంలో విరిగిపోయిన రెయిలింగ్



గోస్తనీ నది వంతెనపై గురువారం ప్రమాదం కారణంగా రెయిలింగ్ విరిగి నదిలో కారు దూసుకుపోయిన ప్రదేశం

అంధకారంతోనే ప్రమాదాలు

- జాతీయ రహదారిపై వెలగని లైట్లు



తగరపువలస సమీపంలో జాతీయ రహదారిపై విద్యుత్ లైట్లు వెలగక అంధకారం

తగరపువలస : జాతీయ రహదారిపై వరుస ప్రమాదాలకు అంధకారమే కారణమని వాహనదారులు అంటున్నారు. ఆనందపురం మండలం వెల్లంకి నుంచి తగరపువలస శివారు వేంకటేశ్వరమెట్ట, గోస్తనీ నది వంతెన వరకు ఇటీవల చీకట్లు అలుముకున్నాయి. వలందపేట, సంగివలసలో పాక్షికంగా మినహా సుమారు 10 కిలోమీటర్ల వరకు జాతీయ రహదారితోపాటు సర్వీస్ రోడ్లు, అండర్‌పాస్‌లు చీకటిగా ఉంటున్నాయి. బుధవారం రాత్రి తగరపువలస నుంచి విజయనగరం వైపు వెళ్లే 50 ఏళ్ల క్రితం నాటి వంతెన రెయిలింగ్‌ను గుర్తు తెలియని వాహనం ఇటీవల ఢీకొనడంతో 10 అడుగుల వరకు కూలిపోయింది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో ప్రాణహాని జరుగలేదు. గురువారం రాత్రి భోగాపురం వైపు వెళ్తున్న కారు అదే వంతెనపై కుడి వైపు రెయిలింగ్‌ను ఢీకొని గోస్తనీనదిలో బోల్తా కొట్టిన విషయం పలువురిని కలవరపాటుకు గురిచేసింది. ఈ ప్రమాదంలో మాదాబత్తుల సురేందర్ అనే వ్యక్తి మృతి చెందిన సంగతి తెలిసిందే. వంతెనలు నిర్మించిన నాటి నుంచి వీటిపై విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయలేదు. అయిదేళ్ల క్రితం జాతీయ రహదారులు విస్తరించిన సమయంలో కూడా వెంకటేశ్వరమెట్ట వద్ద పాక్షికంగా లైట్లు ఏర్పాటు చేశారు. ఇటీవల ఆనందపురం నుంచి తగరపువలస వరకు చాలా మార్గం చీకటిగానే ఉంటుంది. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు జాతీయ రహదారుల సంస్థ కృషి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సీఆర్పీల ఉద్యోగ భద్రతకు కృషి

తగరపువలస: సీఆర్పీల ఉద్యోగ భద్రతతో పాటు వారి వేతనాలు పెంపునకు కృషి చేస్తాన ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అన్నారు. ఆదివారం స్థానిక బైపాస్‌రోడ్డులోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాలులో జరిగిన ఏపీ సీఆర్పీ ఫెడరేషన్ ఉత్తరాంధ్ర సదస్సులో ఆయన ప్రసంగించారు. సమాన పనికి సమాన వేతనం అమలయ్యేలా జాబ్ చార్టర్ రూపొందిస్తామన్నారు. ఫిక్స్‌డ్ అలవెన్సులు, హెల్త్ కార్డుల ద్వారా వైద్యం అందించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామన్నారు. ఈ సందర్భంగా సీఆర్పీ ప్రతినిధులు పలు డిమాండ్లను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా విజయనగరం సూర్యతేజ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గురువులు, గౌరవ అధ్యక్షుడు తవిటి నాయుడు, ఆరు జిల్లాల ప్రతినిధులు గౌరి, అనంతలక్ష్మి, త్రినాథ్, చిన్ని, చిరంజీవి, అనూరాధ, పోలినాయుడు, లక్ష్మనాయుడు, గిరిధర్, జట్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల వన భోజన మహోత్సవం రేపు

తగరపువలస : తగరపువలస శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్యుల వనభోజన మహోత్సవం మంగళవారం ఆనందపురం మండలం బోయిపాలెం పైడా ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో జరుగుతుంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 వరకు వినోద కార్యక్రమాలతోపాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని ఆర్యవైశ్యులంతా సద్వినియోగం చేసుకోవాలని అధ్యక్షుడు చెరుకూరి దేముళ్లు కోరారు.

అందుబాటులోకి బస్ బే



అందుబాటులోకి వచ్చిన బస్‌బే



బస్‌బే వెనుక వైపు నిర్మించిన సిమెంట్ దిమ్మ

భీమునిపట్నం: భీమిలి పెద్దబజారు పాత బస్టాండ్ వద్ద ప్రయాణికుల కోసం గత ప్రభుత్వ హయాంలో రూ. 40 లక్షలతో ప్రారంభించిన బస్‌బే అందుబాటులోకి వచ్చింది. గతంలో ఇక్కడ బస్టాప్ ఉన్నా సరైన సదుపాయం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. దీంతో గత ప్రభుత్వంలో విశాఖలో అన్ని సదుపాయాలతో కూడిన విశాలమై బస్‌బేల నిర్మాణంలో భాగంగా భీమిలి, తగరపువలసకు రెండు బస్‌బేలు మంజూరు చేశారు. నిర్మాణ పనులు ఎన్నికలకు ముందు పారంభమయ్యాయి. ఇక్కడ ప్రయాణికులు ఎక్కువ మంది వేచి ఉండే విధంగా విశాలమైన బస్‌బే నిర్మిస్తుంచడంతో పాటు దాని వెనుకవైపు ఉన్న చెట్టుచుట్టూ సిమెంట్ దిమ్మ ఏర్పాటు ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికులు ఎక్కువ మంది ఇక్కడ కూర్చోవడానికి అవకాశం ఏర్పడింది. ఇదేకాకుండా మెయిన్‌రోడ్డును ఆనుకుని అధునాతనమైన మరుగుదొడ్లు నిర్మించారు. గత ప్రభుత్వం హయాంలో భీమిలిలో ఎన్నడూ లేని విధంగా చక్కటి బస్‌బే నిర్మాణంతో పాటు ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టా. ఇప్పుడు వాటి తాలూకా ఫలాలు ప్రజలకు అందుతుండడం గమనార్హం.

100 మందికి హోమియో మందులు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: స్థానిక కలిగొట్ల స్విగ్ధశ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షణలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు టి.జగన్నాథరావు, టి.జె. మోహన్ వంద మందిని పరీక్షించి వారికి అవసరమైన మందులు అందించారు. ఫౌండేషన్ ప్రతినిధులు కె.ఎస్.ఎన్.మూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, సభ్యులు వి.తాతాజీ, ఎం.శంకర్, జి.రాము, ఎస్.కిశోర్, వి.లక్ష్మణ్ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన రేవంత్‌కుమార్

తగరపువలస : ఆనందపురం గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల విద్యార్థి కుప్ప రేవంత్‌కుమార్‌కు కరాటేలో కాంస్య, రజత పతకాలు లభించాయి. ఆదివారం నగరంలోని టీఎస్సార్ వేదికలో జరిగిన సౌత్ ఇండియన్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో కాటా విభాగంలో రజతం, కుమతి విభాగంలో కాంస్య పతకాలు సాధించాడు. అలాగే కక్కల నిఖిలేష్‌కుమార్‌కు కాటా విభాగంలో కాంస్య పతకం లభించింది. ఆనందపురం జెడ్పీ హైస్కూల్ ఆవరణలో షాడో షూటాఖాన్ కరాటే అకాడమీ కోచ్ ముద్రగడ వెంకటరమణ ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. జై జవాన్ ఫౌండేషన్ తరపున తల్లిదండ్రులను అభినందించారు.

వేములవలస కూడలిలో ట్రాఫిక్‌కు అంతరాయం



వేములవలస కూడలిలో ట్రాఫిక్ స్తంభించడంతో నిలిచిపోయిన వాహనాలు

తగరపువలస : ఆనందపురం మండలం వేములవలస కూడలిలో ఆదివారం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. విశాఖ వైపు నుంచి వచ్చే వాహనాలు కూడలి సర్కిల్ వద్దకు వచ్చే సరికి మార్కెట్ వద్ద రద్దీ కారణంగా నిలిచిపోయాయి. కార్తీక మాసం మూడో సోమవారం పూజలకు సామగ్రి కొనుగోలుకు వచ్చిన వారితో మార్కెట్ నిండిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. చాలా మంది రోడ్డు మీదే పువ్వులు, ఇతర సామగ్రి విక్రయించారు. ఫ్లై ఓవర్ కింద వాహనాల నియంత్రణ లేకపోవడంతో నెమ్మదిగా వెళ్లాయి. దీంతో మిగిలిన ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

జగన్నాథపురంలో గ్రావెల్ దందా



గ్రావెల్ తరలించడంతో ఏర్పడిన గుంత

తగరపువలస: ఆనందపురం మండలం చందక పంచాయతీ జగన్నాథపురం సర్వే నంబర్ 95లో రాత్రి వేళ గ్రావెల్ దందా సాగుతోంది. టీడీపీ నాయకులు కొంత మంది ఇక్కడ గ్రావెల్‌ను సమీపంలో ఉన్న రియల్ ఎస్టేట్ భూములను గ్రావెల్‌తో ఫిల్లింగ్ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. వీరి ఆగడాలకు రెవెన్యూ అధికారులు వంత పాడుతున్నారని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. గ్రావెల్ దందాపై నిఘా ఉంచి కళ్లెం వేయాలని పంచాయతీ వాసులు కోరుతున్నారు.

త్రైత సిద్ధాంతంపై ప్రచారం



త్రైత సిద్ధాంతంపై ప్రచారం చేస్తున్న సభ్యులు

పద్మనాభం: మండలంలోని బాందేవపురంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత విశిష్టత గురించి త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ సభ్యులు ప్రచారం చేశారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు కె.రాజు, వి.భవాని, బి.అంకమ్మ, కె.లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సం



పూజలు చేస్తున్న భక్తులు

పద్మనాభం:మండలంలోని మద్ది పంచాయతీ తునిపాలంలో అభయాంజనేయ స్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణతో పాటు అధిక సంఖ్యలో భక్తులు అభయాంజనేయ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు భారీ సంఖ్యలో అన్నప్రసాదాలు స్వీకరించారు.

ప్రమాదకరంగా డ్రైనేజీలు



మురుగుతో నిండిపోయిన డ్రైనేజీ



వెల్లంకి వద్ద పైకప్పు లేకుండా ఉన్న డ్రైనేజీ

తగరపువలస : ఆనందపురం మండలం వెల్లంకి సర్వీస్ రోడ్డులో డ్రైనేజీలు ప్రమాదకరంగా తయారయ్యాయి. ధనలక్ష్మి వేయింగ్ బ్రిడ్జి వద్ద తరచూ భారీ వాహనాలు డ్రైనేజీ పైనుంచి రాకపోకలు సాగించడంతో పైన ఉన్న సిమెంట్ శ్లాబు శిథిలమైపోయింది. తర్వాత నుంచి ఆ ప్రాంతంలో మట్టి, గ్రావెల్‌తో డ్రైనేజీలు నిండిపోయాయి. ప్రస్తుతం డ్రైనేజీ గడ్డ కట్టుకుపోయినట్టుగా కనిపిస్తోంది. పొరపాటున ఎవరైనా ఇందులో పడిపోతే కూరుకుపోవడం ఖాయమని స్థానికులు అంటున్నారు. డ్రైనేజీలోని పూడికను తొలగించి మూత వేయాలని స్థానికులు కోరుతున్నారు.

భౌగోళిక విజ్ఞానం అవసరం



సదస్సులో మాట్లాడుతున్న గురుకుల డీసీవో రూపావతి

మధురవాడ: భౌగోళిక విజ్ఞానం ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరమని, ముఖ్యంగా ప్రతి విద్యార్థి అవగాహన పెంచుకోవాల్సి అవసరం ఉందని గురుకుల డీసీవో రూపావతి చెప్పారు. మధురవాడ సమీపంలోని కొమ్మాది రిక్షా కాలనీలోని ఆంధ్ర ప్రదేశ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సీవోఈలో ఆదివారం భౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్) దినోత్సవాన్ని పురస్కరించుకుని సెమినార్ నిర్వహించారు. విశాఖ చాప్టర్ ఐజీఎస్ చైర్మన్ ప్రొఫెసర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ భౌగోళిక విశ్లేషణ, శాస్త్రీయ విచారణ, కొత్త అధ్యయనాల ద్వారా చరిత్ర అభివృద్ధికి దోహద పడుతుందన్నారు.తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డి. శాంతకుమారి, ఐజీఎస్ సభ్యురాలు ప్రొఫెసర్ బి. హేమమాలిని, సెక్రటరీ వజీర్ మహమ్మద్, రిటైర్డ్ సీనియర్ సైంటిస్ట్ బి.మంగళమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆనందపురంలో భారీ అన్నసమారాధన

తగరపువలస : ఆనందపురంలోని శ్రీనారాయణేశ్వరస్వామి ఆలయం వద్ద పార్వతీ పరమేశ్వరుల కల్యాణం సందర్భంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. సర్పంచ్ చందక లక్ష్మి అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కొలచిన రాంబాబు శర్మ, సుబ్రహ్మణ్యశర్మ, షిణగం చిన రామారావు, చందక అప్పలస్వామి, శంకరరావు, బంటుపల్లి రమణమ్మ, శ్రీవిఘ్నేశ్వర యువజన సేవా కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



శివాలయం వద్ద అన్నదానం ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మి



వరాహ నృసింహస్వామి అలంకరణలో శివుడు



సూర్యనారాయణ స్వామి అలంకరణలో..



గణపతి అలంకరణలో..

ఆది దేవాయ.. విభిన్న రూపాయ

- రోజుకో దేవతామూర్తి అలంకరణలో దర్శనమిస్తున్న శివుడు
- కాశీ ఉమామహేశ్వర ఆలయ అర్చకుడి ప్రతిభ
- భక్తులను ఆకర్షిస్తున్న విశేష అలంకరణలు



వేంకటేశ్వస్వామి అలంకరణలో ..



షిర్డీ సాయిబాబా అలంకరణలో..



అమ్మవారి అలంకరణలో అర్ధనారీశ్వరుడు

పీఎం పాలెం: భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న కారుషెడ్‌లోని కాశీ ఉమామహేశ్వర స్వామి ఆలయానికి కార్తీక మాసం కావడంతో భక్తులు పోటెత్తుతున్నారు. శైవ క్షేత్రాల్లో అరుదుగా నిర్వహించే పూజలు, అలంకరణలు నిర్వహించడం ఈ ఆలయం ప్రత్యేకత. దీంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలివస్తున్నారు.

ప్రత్యేకం ఉమామహేశ్వరుడి ఆలయం

శివాలయాల్లో శివలింగానికి అభిషేకాలు అనంతరం పూలు, మారేడు దళాలతో అలంకరించడం నిత్య కృత్యం. కానీ కార్‌షెడ్ ఉమామహేశ్వరుడి ఆలయ అర్చకుడి నైపుణ్యంతో ఇక్కడ ఆది దేవుడిని ఆయా రోజు ప్రాముఖ్యాన్ని బట్టి ఆ దేవతామూర్తిని అలంకరిస్తారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో వివిధ దేవతా మూర్తుల అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారు. అలాగే వినియక చవితి , జగన్నాథ స్వామి ఉత్సవాల్లో ఆ దేవతా మూర్తులు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇస్తారు. ఇక్కడ మాత్రం పరమశివుడిని వివిధ రూపాల్లో దర్శించుకోవచ్చు.

భిన్న రూపాల్లో శివుడి దర్శనం

హిందూ దేవతలను పూజించే వారు ఆదివారం సూర్యుడిని, సోమవారం శివుడిని , మంగళవారం ఆంజనేయ స్వామిని, బుధవారం వినాయకుడిని , గురువారం షిర్డీ సాయిబాబాను, శుక్రవారం అమ్మవారిని, శనివారం కలియుగ దైవం వేంకటేశ్వర స్వామిని ప్రత్యేకంగా ఆరాధిస్తారు. ఆ దేవుళ్ల ఆలయాలకు భక్తులు వెళ్లడం పరిపాటి. కారుషెడ్ శివాలయంలో మాత్రం ఆరోజు ప్రత్యేకతను బట్టి లింగాభిషేకం అనంతరం శివలింగంపై వివిధ దేవతా రూపాలను చిత్రించడంతో ప్రత్యేకత నెలకొంది. ఒక వైపు మహా దేవుడిని విభూది, పత్రాలు పుష్పాలతో సుందరంగా అలంకరిస్తూనే ఆరోజు ప్రాముఖ్యతను బట్టి శివలింగంపై వేంకటేశ్వర స్వామి, సూర్య భగవానుడు, షిర్డీ సాయిబాబా, విఘ్నేశ్వరుడు, వరాహ నృశింహస్వామి, శ్రీ కూర్మ, శ్రీ వరాహ, అమ్మవారి ఆకృతులను మలచడం ఆలయానికి ప్రత్యేకతగా నిలిచింది.

దేవతామూర్తుల అలంకరణపై అమితాశక్తి



దేవతలను వివిధ రూపాల్లో అలంకరించడం చిన్నప్పటి నుంచి నాకు ఆసక్తి. ఆర్ట్‌కు సంబంధించి ఎటువంటి శిక్షణ తీసుకోనప్పటికీ చిన్నప్పటి నుంచి ఆలయాలు, దేవతల ఆకారాల అలంకరణపై అవగాహన ఉంది. మనసు పెట్టి అలంకరిస్తాను. మనసులో అనుకున్న దేవతల ఆకృతిని మలచడం పుణ్య కార్యంగా భావిస్తాను. అందుకే అనుకున్న దేవతా కృతిని సులభంగా చిత్రించ గలుగుతున్నాను.

కిరణ్ కుమార్ , కారుషెడ్ శివాలయం అర్చకుడు.